సాక్షి
జగిత్యాల

శనివారం ⸱ 13 ⸱ సెప్టెంబర్ ⸱ 2025



బాధ్యతలు స్వీకరించిన రాజాగౌడ్

జగిత్యాల/మల్యాల: జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా రాజాగౌడ్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.



ఎస్జీఎఫ్ షెడ్యూల్ ఖరారు

ఉమ్మడి జిల్లా పరిధిలో క్రీడా సమాఖ్య పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 15 నుంచి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం

జిల్లాలో నేడు వర్షం కురిసే అవకాశం ఉంది. ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

‘యూరియా కొరత కేంద్రం వైఫల్యమే’



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: యూరియా కొరత కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలోని ఇందిరాభవన్ శుక్రవారం మాట్లాడుతూ.. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తాము అదేపార్టీలో ఉంటున్నామని స్పీకర్‌కు వివరణ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నానని తెలిపారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం చక్కెర ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు సర్కార్ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో కమిటీ వేసిందన్నారు. రూ.176 కోట్లు చెల్లించి, బ్యాంకు తాకట్టులో ఉన్న కార్మాగారాన్ని విడిపించడం జరిగిందన్నారు. నాయకులు జువ్వాడి కృష్ణారావు, బండ శంకర్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నందయ్య పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎండపల్లి మండల ముఖ్య నాయకులతో కరీంనగర్‌లో శుక్రవారం సమీక్షించారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రెండు పిల్లర్లు కుంగినంత మాత్రాన డ్యాం కూలిపోయిందని అబద్ధపు ప్రచారాలు చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని ఆరోపించారు. ఎల్అండ్‌టీ కంపెనీ మరమ్మతు చేస్తామని చెప్పినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీఎమ్మెల్సీ నారదాసులక్ష్మణరావు పాల్గొన్నారు.


యమ ధర్మరాజుకు ప్రత్యేక పూజలు



స్వామివారి సన్నిధిలో ఆయుష్య హోమం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం భరణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్చారణలతో రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమం హారతి, మంత్రపుష్పం పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి విడుదల నిలిపివేత



కాకతీయ కాలువలో తగ్గిన ప్రవాహం

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాకు సాగునీరు అందించే కాకతీయ కాలువకు శుక్రవారం నీటి విడుదలను నిలిపివేశారు. నిర్మల్ జిల్లా సావెల్ గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో ఒక్కరు గల్లంతు కావడంతో, ఆయన ఆచూకీ కోసం నీటి విడుదల ఆపేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 17,715 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, ఆ మేరకు ఔట్‌ఫ్లో వెళ్తోంది. ప్రాజెక్టు నుంచి వరద కాలువకు 8వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, మిషన భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

జిల్లాకు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రాబోయే ఐదు రోజుల్లో జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని పొలాస వ్యవసాయ పరిశోధనస్థానం వాతావరణ శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశముందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 29- 31 డిగ్రీల సెల్సియస్‌గా, రాత్రి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యే అవకాశముందన్నారు.

రోడ్డుపైకి వ్యాపారాలు

- జగిత్యాలలో యథేచ్ఛగా రహదారుల ఆక్రమణ
- వస్తు సామగ్రి, నేమ్ బోర్డులు ఏర్పాటు
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహనదారులు
- స్తంభిస్తున్న ట్రాఫిక్.. ప్రమాదాలకు అవకాశం
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



- ఇది టవర్‌సర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారి. కొందరు దుకాణాల నిర్వాహకులు కొద్దిగా ముందుకు వచ్చి రేకులషెడ్లు వేశారు. తమ వ్యాపార సామగ్రిని రోడ్డుపై పెడుతున్నారు. దీంతో అటు పార్కింగ్‌తో పాటు, ఇటు నడవడం ఇబ్బందికరంగా ఉందని ప్రజలు చెబుతున్నారు.



- ఇది ధర్మారానికి వెళ్లే ప్రధాన రహదారి. ఇక్కడే బస్సులు ఆగుతుంటాయి. మినీస్టేడియాన్ని ఆనుకునే దుకాణాలు ఏర్పాటు చేశారు. కొందరు వ్యాపారులు ముందుకు వచ్చి రోడ్డుపైనే సామగ్రి పెడుతున్నారు. షాపులకు సంబంధించిన నేమ్‌బోర్డులు సైతం రోడ్డుపై పెట్టడంతో ఇబ్బందికరంగా మారుతోంది. బస్సులు వేగంగా వస్తే ప్రమాదాలు జరిగే అవకాశముంది.



జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీ ఇది. ఇక్కడ పదుల సంఖ్యలో ఆస్పత్రులున్నాయి. ఆస్పత్రుల సూచిక బోర్డులు రోడ్డుపైనే పెట్టడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకుండా పోతోంది. శుక్రవారం ఓ వ్యక్తి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే అంబులెన్స్‌లో ఈ దారిలో ఉన్న ఆస్పత్రికి తీసుకొచ్చారు. రోడ్డు ఇరుకుగా మారడంతో అంబులెన్స్ 20 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. రోడ్డు ఆక్రమణలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జగిత్యాల: జిల్లా కేంద్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో ఆస్పత్రులు, సూపర్‌మార్కెట్లు, వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయి. ట్రాఫిక్ పెరిగి.. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. కొత్త బస్టాండ్ నుంచి టవర్‌సర్కిల్ వరకు, తహసీల్ చౌరస్తా నుంచి జంబిగద్దె వరకు, జంబిగద్దె నుంచి అశోక్, పాతబస్టాండ్ ఏరియాల్లో జనసంచారం ఎక్కువగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దుకాణాల నేమ్‌బోర్డులు, ఫ్లెక్సీలతో కూడిన బోర్డులు రోడ్డుపై పెడుతున్నారు. ఇది ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది. అసలే ఇరుకైన రోడ్లు కావడం, రోడ్లను ఆనుకుని బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనదారులకు పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. కార్లు, ఆటోలు అటువైపు వెళ్లే పరిస్థితి లేదు. కొందరైతే దర్జాగా రోడ్లను ఆనుకుని రేకులషెడ్లు నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ‘రోడ్లను ఆనుకుని బోర్డులు పెట్టవద్దు. ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు. అలాంటి వారికి నోటీసులు ఇస్తాం’ అని టీపీవో శ్రీనివాస్ వివరించారు.



- ఇది యావర్‌రోడ్డు. మున్సిపల్ కాంప్లెక్స్ ఎదుట మెట్లు ఉండగా ఇబ్బందికరంగా ఉందని చెప్పి తొలగించారు. కొందరు మెట్లు తొలగించిన చోటే పండ్ల బండ్లు పెట్టి అమ్ముతున్నారు. మెట్లు తొలగించడం కన్నా ఎక్కువగా రోడ్డు కబ్జాచేసి విక్రయాలు సాగిస్తున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



చింతకుంటలో గ్రామపంచాయతీ భవనం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్

కథలాపూర్: గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైతే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం కథలాపూర్ మండలం చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. అంబారిపేటలో కొత్తగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రజలకు అందిస్తున్న వైద్యం గురించి ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఇంటింటా జ్వర సర్వే చేయాలని, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా అందించాలన్నారు. ఆర్డీవో జివాకర్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ అధికారి ప్రసాద్, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, వైద్యాధికారి రచన, ఏఈ జగదీశ్వర్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలు పూర్తి చేయాలి

జగిత్యాల: జిల్లాలోని పంచాయతీ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి, కొత్తవి నిర్మించేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్లు లత, రాజాగౌడ్, డీఆర్డీఏ పీడీ రఘువరణ్, పంచాయతీ అధికారి మదన్‌మోహన్ పాల్గొన్నారు.

23 విండోలకు పర్సన్ ఇన్‌చార్జీల నియామకం

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలోని 23 సింగిల్ విండోలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తూ జిల్లా సహకారాధికారి సీహెచ్.మనోజ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సింగిల్ విండో చైర్మన్ల పదవీకాలాన్ని తిరిగి పొడిగించకుండా, వారిస్థానంలో సహకారశాఖ తరఫున పర్సన్ ఇన్‌చార్జీలను నియమించారు. తిర్మలాపూర్, పోతారం, కల్లెడ సొసైటీలకు ఏ.మల్లేశం, జగిత్యాల, ఇటిక్యాల, పోరుమల్ల సొసైటీలకు ఏ.సాయికుమార్‌గౌడ్, నూకపల్లి, మేడిపల్లి సొసైటీలకు బి.సుజాత, గంభీర్‌పూర్, వల్లంపల్లి, అయిలాపూర్ సొసైటీలకు సీహెచ్.మల్లేశం, తిమ్మాపూర్, మాదాపూర్, భూషణ్‌రావుపేట సొసైటీలకు కె.నాగసంకీర్త్, పెగడపల్లి, గొల్లపల్లి, ధర్మపురికి ఎం.సత్యనారాయణ, సిర్‌పూర్, చిట్టాపూర్, యామాపూర్‌కు ఎం.శ్రీనివాస్, మల్లాపూర్, మెట్ల చిట్టాపూర్, భూపతిపూర్‌కు ఎండీ.అసద్ పర్సన్ ఇన్‌చార్జీలుగా వ్యవహరించనున్నారు.

ప్రిజన్ డ్యూటీ మీట్- 2025లో జైలర్‌కు గోల్డ్‌మెడల్

జగిత్యాలజోన్: ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్- 2025 క్రీడోత్సవాలు సెప్టెంబర్ 9నుంచి 11వరకు హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో నిర్వహించారు. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఆయా రాష్ట్రాల తరఫున జైళ్లశాఖకు చెందిన 1300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. మన రాష్ట్రం తరఫున పాల్గొన్న జగిత్యాల స్పెషల్ సబ్ జైలర్ మొగిలేశు వన్ మినిట్ డ్రిల్ విభాగంలో గోల్డ్‌మెడల్ గెలుచుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌ను అందుకున్నారు. మొగిలేశును హెడ్ వార్డర్లు ఎండీ.మజారోద్దిన్, పీహెచ్.దేవదాసు, కానిస్టేబుళ్లు ఎస్.అశోక్‌కుమార్, ఎం.విజయ్, బి.శ్రీనివాస్ అభినందించారు.



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న జైలర్ మొగిలేశు

సమర్థవంతమైన నేర విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఇన్వెస్టిగేషన్ అండ్ బిల్డింగ్ ది కేస్ అంశాలపై పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. నేర విచారణ, నేర నిరూపణ సమర్థవంతంగా చేయడం ద్వారా నిందితులకు కోర్టు ద్వారా శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. కేసుల దర్యాప్తు ఒక సమగ్ర ప్రక్రియ అని, ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీట్ సిద్ధం చేసేంత వరకు ప్రతి దశను పకడ్బందీగా నిర్వహించడం అత్యంత ముఖ్యమన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో నాన్ గ్రేవ్ అగెనెస్ట్ ఉమెన్ కేసుల్లో, గంజాయ్, మత్తు పదార్థాల కేసుల్లో ప్రొసిజర్ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. డీఎస్పీ రఘుచందర్, సీఐలు అనిల్‌కుమార్, సురేశ్‌కుమార్, సుధాకర్, కరుణాకర్, రాంనర్సింహారెడ్డి, రవి, ఎస్సైలు పాల్గొన్నారు.

మేడిపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసు డైరీలు, సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. 5ఎస్ విధానాన్ని పాటించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపాలన్నారు. స్టేషన్‌పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించాలన్నారు. పాతనేరస్తులపై నిఘా పెంచాలన్నారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

- చల్‌గల్‌లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

పాఠశాలల అభివృద్ధికి కృషి

జగిత్యాలరూరల్/జగిత్యాల: పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.14 లక్షలతో నిర్మించే సైన్స్ ల్యాబ్‌కు, రూ.19 లక్షల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మించే సీసీరోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. చల్‌గల్ గ్రామంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం జరిగిందన్నారు. 10ఎకరాల్లో ఇండోర్ స్టేడియం విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ వరందన్, ఎంఈవో గంగాధర్, మాజీ జెడ్పీటీసీ ఎల్లారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు, నాయకులు పెండెం రాములు, బాలముకుందం, మల్లేశం, ఆసీఫ్ పాల్గొన్నారు.



సైన్స్‌ల్యాబ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులు పాఠశాలల్లోని లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.20 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన గదులను, లైబ్రరీని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసుకోవడంతో పాటు, టీఆర్‌నగర్ వద్ద ఏటీసీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లైబ్రరీకి పుస్తకాలు, పేపర్లు అందించేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కమిషనర్ స్పందన, డీఈ ఆనంద్, ఏఈ అనిల్ పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి

హెపటైటిస్ బి వ్యాక్సిన్‌పై అవగాహన లేక అనేక మంది మరణిస్తున్నారని, అందరూ వ్యాక్సిన్ తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మాత శిశు కేంద్రంలో హెల్త్‌కేర్ వర్కర్లకు హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను ఇచ్చారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఆర్ఎంవో సుమన్‌రావు, గీతిక, సూర్య, మహేశ్ పాల్గొన్నారు.



జర్నలిస్టుల స్వేచ్ఛ, హక్కులపై ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోంది. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది. ప్రజాసమస్యలపై గళమెత్తిన ‘సాక్షి’ ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటుగా విలేకరులపై అక్రమ కేసులు బనాయిస్తూనే ఉంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడే పాత్రికేయంపై టీడీపీ కూటమి సర్కారు జరుపుతున్న దాడులు, అక్రమ కేసుల బనాయింపుపై ఉమ్మడి జిల్లాలోని జర్నలిస్టులు, రాజకీయ నాయకులు ధ్వజమెత్తారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే



ఏపీలో పత్రికా స్వేచ్ఛపై దాడిచేసి రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారు. సాక్షి ఎడిటర్‌ను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేయడం అన్యాయం. పత్రికల్లో వచ్చిన వార్తల్లో ఏదైనా తప్పు ఉంటే వివరణ కోరాలే తప్ప అక్రమ కేసులు పెట్టి బెదిరించడం సరికాదు. ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది.

– కుడుతాడి బాపురావు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

ఇలా వేధించడం సరికాదు



సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎవరో మాట్లాడిన అంశాలను ప్రచురిస్తే జర్నలిస్ట్‌పై కక్ష సాధింపు చర్యలు చేస్తే ఎలా? పత్రికలో వచ్చిన దానిపై అభ్యంతరం ఉంటే రిజైండర్ ఇవ్వొచ్చు. అభ్యంతరాలు వ్యక్తపరుచొచ్చు. అక్రమంగా కేసులు నమోదు చేసి వేధించడం సరికాదు.

– సీహెచ్.గోపాలకృష్ణ, కరీంనగర్ అధ్యక్షుడు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్

మీడియా స్వేచ్ఛను కాపాడాలి



ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సాక్షి మీడియాను లక్ష్యంగా చేసుకొని దౌర్జన్యానికి పాల్పడుతోంది. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ముమ్మాటికి పత్రికా స్వేచ్ఛను హరించడమే. ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలి.

– గాండ్ల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, టీయూడబ్ల్యూజే –ఐజేయూ

కేసులు దుర్మార్గం



సాక్షి దినపత్రిక పత్రికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగడం హేయమైన చర్య. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు విలేకరులపై కేసులు పెట్టడం దుర్మార్గం. తక్షణమే ఏపీ ప్రభుత్వం సాక్షి ఎడిటర్‌తో పాటు విలేకరులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి. ఏపీ ప్రభుత్వం పత్రికలను లొంగదీసుకునేందుకు కుట్రపూరితంగా వ్యవహరించడం తగదు.

– వెలిచాల రాజేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి

రాజీకి వారధి లోక్ అదాలత్

- కక్షిదారులకు సత్వర న్యాయం
- కోర్టుల్లో పెండింగ్ కేసులు తగ్గింపు
- 20 నెలల్లో 14,778 కేసుల పరిష్కారం
- నేడు జిల్లావ్యాప్తంగా మెగా లోక్ అదాలత్



17 ఏళ్ల తర్వాత ఇటీవల లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న కక్షిదారులు(ఫైల్)

జగిత్యాలజోన్: ‘ఓడిన వాడు కోర్టులో ఏడిస్తే.. గెలిచిన వాడు ఇంటికెళ్లి ఏడ్చాడు’ అనే సామెతను కోర్టు కేసులు ఎదుర్కొన్నవారు చెబుతుంటారు. కేసుల విచారణలో ఎనలేని జాప్యంతో కక్షిదారులకు సత్వర న్యాయం దక్కడం లేదనే వాదన ఉంది. ఏడాదిలో కనీసం నాలుగైదు మెగా లోక్ అదాలత్‌లు నిర్వహించి, వీలైనన్ని కేసులు పరిష్కరించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు చొరవ చూపుతున్నారు. శనివారం(నేడు) జిల్లావ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నారు.

20 నెలలు.. 14,778 కేసుల పరిష్కారం

జిల్లాలోని అన్ని కోర్టుల్లో విచారణలో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల్లో 14,778 కేసులకు 20 నెలల్లో లోక్ అదాలత్ ద్వారా మోక్షం లభించింది. 2024లో 10,660 కేసులు, 2025లో ఇప్పటి వరకు 4,118 కేసులు పరిష్కరించారు. అయినా జిల్లాలోని అన్ని కోర్టుల్లో మరో 18వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. శనివారం నాటి లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన కేసులు 8,697 ఉండగా, 3వేలకు పైగా కేసులు పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్రిమినల్ కేసుల్లో 865, మనీ రికవరీ కేసుల్లో 51, దంపతులకు సంబంధించినవి 31 కేసులు, 316 సివిల్ కేసులతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, ఈ- పెట్టి కేసులు, చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించనున్నారు. జిల్లాలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కోర్టులు లేవు. జడ్జిల నియామకం పెద్దగా జరగడం లేదు. దీంతో చిన్న విషయంలో కోర్టుకు వెళ్లినా పరిష్కారానికి ఏళ్లసమయం పడుతోంది. ఒక కేసులో దాదాపు 15 నుంచి 20మందిని విచారించి తీర్పులు చెప్పడం జడ్జిలకు కష్టసాధ్యంగా మారుతోంది.

లోక్ అదాలత్‌కు అధిక ప్రాధాన్యం

లోక్ అదాలత్‌ల్లో రాజీ చేసుకోదగ్గ అన్ని రకాల కేసులు పరిష్కరిస్తున్నారు. ఇరువర్గాలకు రాజీమార్గంలో నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం మధ్యవర్తిత్వ బెంచ్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. లోక్ అదాలత్ తీర్పులు సుప్రీం కోర్టు తీర్పుతో సమానం. ఒక్కసారి లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న తర్వాత మళ్లీ ఎక్కడికెళ్లినా చెల్లదు. ఎలాంటి ఫీజులు వసూలు చేయరు. లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇరువర్గాలకు ప్రయోజనం



కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికి లోక్ అదాలత్‌లు ఉపయోగపడతాయి. కేసుల కోసం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బదులు, ఇరువర్గాలు రాజీ చేసుకుంటే సంతోషంగా ఉండవచ్చు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారంతో కోర్టులపై పెండింగ్ కేసుల భారం తగ్గుతుంది.

– సి.రత్న పద్మావతి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్

సత్వర న్యాయం



లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుంది. డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుంది. మనశ్శాంతి లభిస్తుంది. క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకునేందుకు లోక్ అదాలత్ ఒక్క వేదిక. రాజీయే రాజమార్గం అనే సూత్రంపై లోక్ అదాలత్‌లు పనిచేస్తాయి.

– వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ, జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటకు చెందిన మెట్టు శ్రీనివాస్(50)సొంత ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈయన మూడు రోజుల క్రితమే చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. శరీరం కుళ్లిపోయి, దుర్వాసన రావడంతో చుట్టుపక్కలవారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం బయటపడింది. మృతుని కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. కొత్తగా ఇల్లు నిర్మిస్తుండడంతో శ్రీనివాస్ స్వగ్రామం గంభీరావుపేటలో ఉంటున్నారు. ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య


అనిల్(ఫైల్)

బోయినపల్లి (చొప్పదండి): ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన ముకుంద అనిల్ (22) ఏడాదిగా ఒంటరిగా ఉంటూ కిరాణషాప్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. రెండు నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురవుతున్నాడు. శుక్రవారం ఇంట్లో ఇనుప పైపుకి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

పెద్దపల్లిరూరల్: ఓ బాలికపై అఘాయిత్యం చేసిన కేసులో మందల రవికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధించి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా రూ.2లక్షల పరిహారం ఇప్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత శుక్రవారం తీర్పునిచ్చారని సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 2017 జనవరి 21న పాల పాకెట్ తీసుకొచ్చేందుకు ఇంటినుంచి వెళ్లిన తన కూతురు చాలాసేపటి వరకు ఇంటికి రాలేదు. ఎదురుగా వెళ్లిన ఆమెను ఇంటివద్ద దిగబెడతానని నమ్మించి రవి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయంలో పోలీస్‌స్టేషన్‌లో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. పూర్వాపరాలపై విచారణ జరిపి వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో రవికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. అలాగే లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా రూ.2లక్షల పరిహారం ఇప్పించాలని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన పోలీసు అధికారులను, కోర్టు కానిస్టేబుళ్లను సీపీ అభినందించారు.

ఉరేసుకుని యువకుడు మృతి


శరత్(ఫైల్)

వెల్గటూర్: నాలుగేళ్ల క్రితమే తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, అదే అనారోగ్యం కొడుకునూ బాధించింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన తల్లికి కడుపు కోత మిగిల్చాడు. ఈ సంఘటన వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంగ శరత్‌కుమార్(23) గ్రామంలో హార్వెస్టర్ నడిపిస్తుంటాడు. కొంతకాలంగా ఛాతినొప్పితో బాధపడుతున్నారు. పలుమార్లు హాస్పిటల్‌కు వెళ్లినా సమస్య తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తండ్రి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. చేతికందొచ్చిన ఒక్కగానొక్క కొడుకు బలవన్మరణానికి పాల్పడడంతో తల్లి రాజేశ్వరి గుండెలవిసేలా రోదించింది. రాజేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి


ముస్తాబాద్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పండుగలు సమీపిస్తున్న వేతనాలు చెల్లించడం లేదని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో పంచాయతీ కార్మికులు శుక్రవారం వేతనాల కోసం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ వేతనాలు రాకపోవడంతో కార్మిక కుటుంబాలు పస్తులు ఉంటున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికులందరిని పర్మనెంట్ చేస్తామని హామీలు ఇచ్చి మరచిపోయారన్నారు. రూ.26వేల వేతనం ఇస్తామని రెండేళ్ల క్రితం చెప్పారన్నారు. ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 26 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పల్లటి బాబు, లక్ష్మణ్, భిక్షపతి, రాజు, స్వరూప, దేవరాజు, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ షెడ్యూల్ ఖరారు

15 నుంచి జిల్లాస్థాయిలో ప్రారంభం కానున్న పోటీలు


కరీంనగర్‌లోని మానేర్ స్కూల్‌లో జరిగిన అర్బన్ కబడ్డీ పోటీలకు హాజరైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: పాఠశాలల క్రీడాసమాఖ్య క్రీడా సందడి మొదలైంది. మండల, జోన్‌స్థాయిలో పోటీలు అట్టహాసంగా, అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా మైదానాలు విద్యార్థులు, క్రీడాకారులతో కిక్కిరిసిపోతున్నాయి. పలు మండలాల్లో నిర్వహించిన మండలస్థాయి పోటీలు జాతరలను సైతం మైమరపింపజేసేలా జరుగుతుండడం విశేషం. ఈనెల 14 వరకు అన్ని మండలాల్లో క్రీడాపోటీలు ముగియనున్న నేపథ్యంలో జిల్లాస్థాయి, ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల నిర్వాహణకు రంగం సిద్ధమైంది. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పాఠశాలల క్రీడాసమాఖ్యల కార్యదర్శులు క్రీడల నిర్వహణపై ఇటీవల సమావేశమయ్యారు. ఏ జిల్లాలో ఏఏ క్రీడల్లో పోటీలను నిర్వహించాలో, జిల్లాస్థాయిలో, ఉమ్మడి జిల్లాస్థాయిలో నేరుగా పోటీలను నిర్వహించే క్రీడలపై ఓ కొలిక్కి వచ్చారు. ఎక్కువ ఆదరణ ఉన్న క్రీడల్లో మొదటగా జిల్లాలో పోటీలను నిర్వహించి.. తదనంతరం ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలను నిర్వహించి ఉమ్మడి జట్టును ఎంపిక చేయనున్నారు. మిగిలిన క్రీడల్లో నేరుగా ఉమ్మడి జిల్లా పోటీలను నిర్వహించి ఉమ్మడి జట్టును ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు జిల్లాస్థాయిలో, ఉమ్మడి జిల్లాస్థాయిలో జరిగే క్రీడల జాబితాను ఎస్జీఎఫ్ కార్యదర్శులు వేణుగోపాల్(కరీంనగర్), లక్ష్మణ్(పెద్దపల్లి), శ్రీనివాస్(రాజన్న సిరిసిల్ల), చక్రాధర్(జగిత్యాల) ప్రకటించారు.

అండర్–14, 17..

పాఠశాల స్థాయిలో అండర్–14, 17 బాలబాలికల విభాగాల్లో జరగనున్న ఎస్జీఎఫ్ క్రీడాపోటీలు ఆగస్టు చివరి వారం నుంచే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. నేటికి కూడా పలు మండలాల్లో మండలస్థాయి పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. దీంతో జిల్లాస్థాయి పోటీలను నిర్వహించడానికి ఎస్జీఎఫ్ కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 15న కరీంనగర్‌లో అండర్–17 వాలీబాల్ జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం కానుండగా.. మిగిలిన జిల్లాల్లో కూడా జిల్లాస్థాయి పోటీలు పలు క్రీడల్లో జరగనున్నాయి.

జిల్లాస్థాయి వారీగా నిర్వహించే క్రీడలు

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, కరాటే అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి వారీగా నిర్వహించే క్రీడలు

- కరీంనగర్ జిల్లాలో అథ్లెటిక్స్, అర్చరీ, బేస్‌బాల్, బీచ్ వాలీబాల్, బాక్సింగ్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, జూడో, కళారియపటు, కురాష్, మల్లాకంబ్, మోడరన్ పెంటాథ్లాన్, నెట్‌బాల్, రగ్బీ, సెపక్ తక్రా, షూటింగ్, స్కేటింగ్, సాఫ్ట్‌బాల్, స్క్వాష్, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, యోగాసనా(అండర్–14, 17).
- పెద్దపల్లి జిల్లాలో స్విమ్మింగ్, టెన్నిస్, సైక్లింగ్, బ్యాడ్మింటన్, కరాటే(అండర్–14, 17), క్రికెట్, కబడ్డీ, వాలీబాల్(అండర్–14).
- జగిత్యాల జిల్లాలో తైక్వాండో, బాస్కెట్‌బాల్, చెస్, ఖోఖో(అండర్–14, 17).
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో హ్యాండ్‌బాల్(అండర్–14, 17), వాలీబాల్, క్రికెట్, కబడ్డీ(అండర్–17).

వర్షాలతో అంతరాయం

జగిత్యాల జిల్లాలో ఇటీవల కాలంలో వర్షాలు భారీస్థాయిలో పడడంతో పోటీలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పుడిప్పుడే మండలస్థాయి పోటీలు పూర్తి కావస్తున్నాయి. వాతావరణం అనుకూలిస్తే అక్టోబర్ మొదటివారంలో జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తాం. ఉమ్మడి జిల్లా పోటీలకు కూడా సిద్ధంగా ఉన్నాం.

– చక్రధర్, ఎస్జీఎఫ్ కార్యదర్శి, జగిత్యాల

ఉత్తమ జట్టును ఎంపిక చేయాలి



పాఠశాలల క్రీడలకు పూర్వ వైభవం వచ్చింది. కరోనా అనంతరం ఈ సంవత్సరం జరుగుతున్న పోటీలకు పెద్దసంఖ్యలో క్రీడాకారులు హాజరవడం శుభపరిణామం. ఆయా జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శులు ఉత్తమమైన, పటిష్టమైన ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు పంపించాలి.

– నందెల్లి మహిపాల్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు

విజేతగా నిలవాలి



69వ రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడల్లో ఉమ్మడి కరీంనగర్ జట్టు విజేతగా నిలవాలి. ఎస్జీఎఫ్ క్రీడల్లో నంబర్‌వన్‌గా ఎదగాలి. జిల్లా, ఉమ్మడి జిల్లా పోటీలకు ఒలింపిక్ సంఘం సహాయ, సహకారాలందిస్తాం. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఘనంగా నిర్వహించాలి.

– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి

మంచి స్పందన..



కరీంనగర్ జిల్లాలో పెద్దసంఖ్యలో ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల నిర్వహణ బాధ్యతలను తీసుకున్న. క్రీడలకు తలమానికంగా ఉన్న కరీంనగర్ జిల్లాలో క్రీడలను ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాం. మండలస్థాయి పోటీలకు మంచి స్పందన వచ్చింది. జిల్లాస్థాయి పోటీలను కూడా అదే స్ఫూర్తితో నిర్వహిస్తాం.

– బి.వేణుగోపాల్, ఎస్జీఎఫ్ కార్యదర్శి, కరీంనగర్

ఘనంగా నిర్వహిస్తాం



పెద్దపల్లి జిల్లాలో జరగనున్న ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మండలస్థాయి, మండల జోన్‌స్థాయి పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. క్రీడాకారులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. జిల్లాస్థాయి పోటీలు కూడా త్వరలోనే నిర్వహిస్తాం.

– కనుకుంట్ల లక్ష్మణ్, ఎస్జీఎఫ్ కార్యదర్శి, పెద్దపల్లి

4.098 కిలోల గంజాయి స్వాధీనం

- కారు, మొబైల్‌ఫోన్ స్వాధీనం
- పెద్దపల్లి ఏసీపీ కృష్ణ వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కృష్ణ

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి గ్రామ శివారులో 4.098 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ కృష్ణ తెలిపారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై రమేశ్ పొత్కపల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా ఓ కారు వచ్చిందన్నారు. అందులో తనిఖీ చేయగా.. కంసాని అరుణ్ వద్ద 4.098 కేజీల ఎండు గంజాయి లభించిందని పేర్కొన్నారు. దాని విలువ సుమారు రూ.2.04 లక్షలు ఉంటుందని వివరించారు. కారుతోపాటు మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని వివరించారు. ఇదే కేసులో నిందితులు ఇల్లెందుకు చెందిన బొల్లెద్దు మహేందర్, చీమల ఆకాశ్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్సైతోపాటు ఏఎస్సై రత్నాకర్, కానిస్టేబుళ్లు రాజుయాదవ్, హరీశ్, రాము, శివశంకర్, రాజేందర్, రాజు, రమేశ్‌ను అభినందించారు.

ఎన్టీపీసీ స్టేజ్‌-2కు పర్యావరణ అనుమతులు


తెలంగాణ స్టేజ్-1 ప్రాజెక్టు

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎన్టీపీసీలో చేపట్టిన 2,400 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ పనులకు పర్యావరణ అనుమతులు లభించాయి. సుమారు ఎనిమిది నెలల క్రితం ఇందుకోసం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. పర్యావరణ క్లియరెన్స్ కోసం గత ఆగస్టు 26న ఎన్టీపీసీ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. నివేదికను సమగ్రంగా పరిశీలించిన అనంతరం పర్యావరణ అనుమతులను జారీ చేస్తూ భారత ప్రభుత్వ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ విభాగం అనుమతి జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం –2014 ప్రకారం బొగ్గు ఆధారిత 4,000 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను తెలంగాణ రాష్ట్రం కోసం ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం ఆదేశించింది. ఈక్రమంలో ఇప్పటికే 1,600 మెగావాట్ల ఒకటో దశ ప్రాజెక్టు నిర్మించింది. రెండోదశలో ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లను నిర్మించనున్నారు.

130 మంది మందుబాబులకు జరిమానా

- డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ యువత


డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి లో 14 రోజులుగా నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డ 130 మంది మందుబాబు లను శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. వీరిలో 70 మంది ద్విచక వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.2వేలు, 30 మంది ద్విచక్ర వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.5వేలు, 30 మంది టూవీలర్, ఫోర్ వీలర్ వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ వేములవాడ మేజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఠాణా ఆవరణలో వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేపించారు.

అదుపుతప్పి బోల్తాపడిన ఆటో

శంకరపట్నం: కేశవపట్నం గ్రామంలో శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో నలుగురికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపా రు. హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన ఆరుగురు ఆటోలో తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంలో బంధువుల సంవత్సరికానికి వెళ్తుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలోని నలుగురు మహిళలకు గాయాలు కాగా మరో ఆటోలో చికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి విక్రేతల రిమాండ్

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపే ట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండలంలో ని గర్జనపల్లికి చెందిన భరత్, దినేశ్ వీర్నపల్లిలో గంజాయి విక్రయిస్తుండగా ఎస్సై వేముల లక్ష్మణ్ అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు.

పేట్రేగిపోతున్న సైబర్‌మోసగాళ్లు

- కొత్త పంథాలో ఆన్‌లైన్ మోసాలు
- చలాన్ల పేరుతో గ్రూపుల్లో ఏపీకే ఫైల్స్
- ఓపెన్‌చేస్తే ఖాతాలోంచి మాయమవుతున్న డబ్బు
- బలవుతున్న సామాన్యులు, అమాయకులు



గోదావరిఖని: ప్రపంచం సెల్‌ఫోన్ గుప్పిట్లోకి వచ్చింది. ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఆన్‌లైన్‌షాపింగ్, ఆన్‌లైన్ టూరిజం, ఆన్‌లైన్ గేమింగ్.. ఇలా ఒక్కటేమిటి ప్రతీది సెల్‌ఫోన్ ద్వారానే జరుగుతోంది. సెల్‌ఫోన్ ఎంత సౌకర్యంగా ఉందో, అప్రమత్తంగా లేకుంటే అదేస్థాయిలో మోసపోయే ప్రమాదమూ ఉంది. రోజుకో తీరులో సైబర్‌మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. సెల్‌ఫోన్ లేకుంటే క్షణం కూడా గడవని ఈరోజుల్లో.. ఇదే సెల్‌ఫోన్ ద్వారా రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. అమాయకులు, మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేనివారు. డబ్బు అత్యవసరం ఉన్నవారిని టార్గెట్ చేసుకొంటున్నారు. కేవలం నిరక్ష్యరాస్యులే కాదు విద్యావంతులు సైతం సైబర్‌గాళ్ల వలలో చిక్కుతున్నారు. కొద్దిరోజులుగా బాధితులు పోలీస్‌కు ఫిర్యాదు చేయడం అధికంగా అవుతోంది.

అపరిచిత కాల్స్‌కు స్పందిస్తే..

అపరిచిత కాల్స్‌కు స్పందించినా, గుర్తుతెలియని లింక్స్ క్లిక్ చేసినా సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడ్డట్లే. వయస్సు, వ్యక్తుల విధులను బట్టి కూడా నేరాలు జరుగుతున్నాయి. ఒకరు ఫోన్‌చేసి ఆధార్ అప్‌డేట్ చేయాలి.. లింక్ పంపిస్తున్నామంటూ ఖజానా ఖాళీ చేస్తారు. మరొకరు వీడియోకాల్ చేసి అమ్మాయిలతో మాట్లాడించి న్యూడ్‌గా రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేసి మరీ డబ్బులు గుంజుతారు. ఇంకొకరు ఓటీపీ అడిగి ముంచుతారు. ఇలాంటి సైబర్ మోసాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఇలాంటి నేరాల్లో కొన్నింటిపైనే పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. కొందరు పరువు పోతుందనో, ఇరుగుపొరుగువారిలో చులకన అవుతామనే ఉద్దేశంతో మోసపోయామని తెలిసినా ఎవరికీ చెప్పకుండా లోలోపల మదనపడుతున్నారు.

ఏపీకే ఫైళ్లు పంపి ఇలా..

ఇటీవల సోషల్ మీడియాలో సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ లేదా ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వాటిని ఓపెన్‌చేసి ఓకే అని క్లిక్ చేసేవారి ఫోన్లు హ్యాక్ అవుతున్నాయి. ఫోన్ నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తోంది. ఈ విషయం తెలియని వారు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా సొమ్ము పంపితే వెంటనే సైబర్ నేరగాళ్లు పిన్ నంబర్ తెలుసుకొని నిమిషాల్లో బాధితుడి బ్యాంకు ఖాతాలోని నగదు కాజేస్తున్నారు. హ్యాక్ చేసిన ఫోన్ డివైస్ డిస్‌ప్లే సైబర్ నేరగాళ్ల చేతిలో ఉంటుంది. దీంతో నేరగాళ్లు ఆ ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లకు ఏపీకే ఫైళ్లను పంపుతున్నారు. దీంతో తమకు తెలిసిన వ్యక్తి నుంచే మేసేజ్ వచ్చిందని భావించిన ఇతరులు ఆపీకే ఫైళ్లలింక్‌ను ఓపెన్ చేయటంతో ఖాతాలో సొమ్ము కోల్పోతున్నారు. పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీఐ రివార్డ్స్, పెళ్లికార్డులు, బర్త్‌డే ఇన్విటేషన్ తదితర లింక్‌ల పేరిట పంపుతూ బ్యాంకు ఖాతాల నుంచి నగదు లాగేస్తున్నారు.


జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్..

జాబ్ పేరుతో ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించమని చాలామందిని మోసం చేస్తున్నారు. ఇలాగే స్టాక్‌మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తే లాభాలు వస్తాయని ఆన్‌లైన్‌లో లాభాలు చూపిస్తూ పెద్దమొత్తంలో పెట్టిబడి పెట్టిన తర్వాత చేతులెత్తేస్తున్నారు. కొందరికి ఓటీపీ పంపి దాన్ని చెప్పమని ఆ తర్వాత ఖాతా ఖాళీ చేస్తున్నారు. మీ ఆధార్‌కార్డ్ ద్వారా ఫ్రాడ్ జరిగిందని వెంటనే డిటేల్స్ చెప్పాలని ఒత్తిడి చేసి ఆ తర్వాత సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు.

రెండేళ్లలో జరిగిన సైబర్ మోసాలు

ఏడాది	ఫిర్యాదులు	నష్టం(రూ.లలో)	రికవరీ(రూ.లలో)
2024	1,406	3,91,20,408	11,02,566
2025	1,206	2,75,00,542	22,35,689

అప్రమత్తంగా ఉండాలి



అప్రమత్తతతోనే ఆన్‌లైన్‌మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ప్రధానంగా ఏపీకే ఫైల్స్ పంపి వాటిని ఓపెన్ చేస్తే ఉన్న సొమ్మంతా మాయం చేస్తున్నారు. ఉద్యోగాలిప్పిస్తామని లింక్‌లు పంపించి ఆ తర్వాత సొమ్ము రాబట్టి మోసం చేస్తున్నారు. ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే భారీలాభాలు ఇస్తామని, లాభాలను ఆన్‌లైన్‌లోనే చూపించి పెద్దమొత్తంలో నొక్కేస్తున్నారు. దీనిపై పోలీసుశాఖ అవగాహన కల్పిస్తోంది. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి. – అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం

రాజన్నా శరణు..శరణు


సినీనటుడు చిన్నకు స్వామి వారి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమపూజ, గండాదీపంలో నూనె పోశారు. స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఈ–టికెట్ విధానం ప్రవేశపెట్టారు. దీంతో రోజుకో కలర్‌తో కూడిన ప్రింట్ అవుట్‌తో కోడె టికెట్లు అందజేస్తున్నారు. రూ.200 కోడె టికెట్‌కు ఒక లడ్డూ ఉచితంగా అందజేస్తున్నారు. సినిమా నటుడు చిన్న స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉద్యోగిపై లైంగిక వేధింపులు.. తహసీల్దార్ అరెస్టు


పెగడపల్లి తహసీల్దార్ రవీందర్

జగిత్యాలక్రైం: ప్రభుత్వ మహిళా ఉద్యోగిని లైంగిక వేధింపులకు గురిచేసిన జగిత్యాల జిల్లా పెగడపల్లి తహసీల్దార్ రవీందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ వివరాల ప్రకారం.. పెగడపల్లి తహసీల్దార్ రవీందర్ జగిత్యాల పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే విధులు నిర్వహించాడు. ఆ సమయంలో అతనితో కలిసి పనిచేసిన ఓ మహిళా ఉద్యోగికి వాట్సప్‌లో అసభ్యకరంగా సందేశాలు పంపాడు. ఆమెతో దురుసుగా ప్రవర్తించాడు. తనను లైంగికంగా వేధించాడని బాధిత మహిళ శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు రవీందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఫిర్యాదును వాపస్ తీసుకోవాలని జగిత్యాలకు చెందిన ఓ తహసీల్దార్ మధ్యవర్తిత్వం వహించాడు. సదరు మహిళా ఉద్యోగి ఒప్పుకోకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

రెనే ఆస్పత్రిలో అధునాతన గుండె చికిత్స


వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ బంగారి స్వామి

కరీంనగర్‌టౌన్: నగరంలోని రెనే ఆస్పత్రిలో అధునాతన గుండె చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్‌తో కలిసి ఆపరేషన్ వివరాలు తెలియజేశారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన అజయ్ అనే బాలుడికి పుట్టినప్పటి నుంచి గుండెకు రంధ్రం ఉందని తెలిపారు. ఆయాసం, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ రావడంతో గుండెదడ, బరువైన పనులు చేయలేక బాధపడుతున్నాడని వివరించారు. రెనే ఆస్పత్రికి వచ్చిన తర్వాత అతడికి మల్టీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ(ఎంఐసీఎస్) చేసినట్లు తెలిపారు. ఛాతి భాగంలో పూర్తిగా చీరకుండ, పక్కటెముకల మధ్యలో చిన్న గాటు పెట్టి ప్రత్యేకమైన పరికరం ద్వారా ఈ ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. మెట్రో సిటీలకే పరిమితమైన ఈ ఆపరేషన్ కరీంనగర్‌లోని రెనే ఆస్పత్రిలో మాత్రమే అందుబాటులో ఉందన్నారు. తెలంగాణలో హైదరాబాద్ మినహా రోబోటిక్ టెక్నాలజీ ద్వారా కీలుమార్పిడి శస్త్రచికిత్స వైద్యసేవలు తమ ఆస్పత్రిలో అక్టోబరులో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్డియాలజీ డాక్టర్ దినకర్, చిన్నపిల్లల గుండె వైద్యుడు రాజావిజయేందర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ రవీంద్రాచారి, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్‌బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం సకుటుంబ సపరివారం


సిరిసిల్లలో యూరియా కోసం వచ్చిన తల్లీకూతుళ్లు పడిగె మణెమ్మ, రమ్య


ఓదెల: తహసీల్దార్‌తో గోడు వెల్లబోసుకుంటున్న రైతులు

- సిరిసిల్లలో క్యూలైన్‌లో కుటుంబ సభ్యులు
- ఓదెలలో తహసీల్ ఆఫీస్ ముట్టడి

సిరిసిల్ల/ఓదెల: అన్నదాతలు యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతుల కష్టాలు చెప్పలేనివిగా ఉన్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాప్ వద్ద శుక్రవారం కుటుంబ సభ్యులు క్యూలైన్‌లో నిల్చున్నారు. సిరిసిల్ల శివారులోని చిన్నబోనాలకు చెందిన పడిగే ఎల్లయ్య, మణెమ్మ దంపతులు తమ కూతురు రమ్యతో కలిసి తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో ఉన్నారు. ఒక్కొక్కరికి ఒకే బస్తా ఇస్తుండడంతో తాము సాగుచేసిన ఐదు ఎకరాలలోని వరిపొలానికి ఎటూ సరిపోవని ముగ్గురు లైన్‌లో ఉండి మూడు యూరియా బస్తాలకు టోకెన్ పొందారు.

ఓదెల తహసీల్ ముట్టడి

ఓదెలకు చెందిన రైతులు దాదాపు 100 మంది యూరియా కోసం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. స్థానిక ఫర్టిలైజర్‌షాపు యజమాని బ్లాక్‌లో విక్రయిస్తున్నాడంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఏఈవోలు సైతం టోకెన్లు సరిగా ఇవ్వడం లేదన్నారు. గంటల తరబడి క్యూలైన్‌లో ఎదురుచూస్తుంటే స్టాక్ లేదంటూ కుంటి సాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.